క్లుప్తంగా

యోగాతో ఉత్తమ జీవన విధానం



ఉయ్యూరు: యోగాతో మానసిక ప్రశాంతతో పాటు ఉత్తమ జీవన విధానం ఏర్పడుతుందని యోగా గురువు దావులూరి రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. ఉయ్యూరు పట్టణంలోని సాత్విక్ యోగా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు సీహెచ్‌వీవీ కుటుంబ రాజు కార్యాలయంలో ఆదివారం ట్రస్టు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాలపై రాధాకృష్ణమూర్తి, మాస్టర్ బెనర్జీ శిక్షణ ఇచ్చారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ట్రస్టు కార్యదర్శి జంపాన శ్రీనివాసగౌడ్, శానిటరీ ఇన్‌చార్జి సంతోష్, ప్రతినిధులు పులివర్తి శివకాళిదాసు, బెజవాడ లక్ష్మీనాగభూషణరావు, ఉయ్యూరు నాగరాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



ఉయ్యూరు: ఎన్‌సీసీతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని శ్రీనివాస విద్యాసంస్థల అధినేత డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉయ్యూరులో ఎన్‌సీసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్‌సీసీతో కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పరుచూరి నీలిమ పాల్గొన్నారు. ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివనాథ్, ప్రత్యేకాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు వృద్ధులు, మానసిక వికలాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్పనానగర్, క్యాపిటల్ ఎంపైర్, పెద్దచెరువు, యాదవుల బజార్, కానూరు ప్రధాన గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

యనమలకుదురులో సమస్యల వెల్లువ



పెనమలూరు: యనమలకుదురులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పల్లె ప్రగతి కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు అనేక సమస్యలు విన్నవించుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, కొత్తగా వేసిన బోరు పనిచేయడం లేదన్నారు. ఇక డ్రెయినేజీలు, రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పారిశుద్ధ్యం లోపించిందని, దోమలు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు పరిష్కారం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెలగపూడి శంకర్‌బాబు, అనుమోలు ప్రభాకరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం తేవాలంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తోన్న భర్తపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... భవానీపురం ఎంఐజీకి చెందిన చిక్కాల సాయి శరణ్య, చిక్కాల రాజేష్‌లకు 2015లో క్రైస్తవ సంప్రదాయంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో సాయి శరణ్య తల్లిదండ్రులు కట్నంగా రూ. 3లక్షలు నగదు, బంగారు నగలు రాజేష్‌కు ఇచ్చారు. కొంత కాలం వీరి సంసారం సజావుగానే సాగింది. వీరికి బాబు పుట్టాడు. ఆ తర్వాత శరణ్య భర్త రాజేష్ వ్యసనాలకు బానిసయ్యాడు. అదనంగా రూ. 2 లక్షలు కట్నం తేవాలంటూ వేధించసాగాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను వేధిస్తున్నాడు. కన్న కొడుకును, భార్యను చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి భయాందోళనకు గురిచేస్తున్నాడు. సెప్టెంబర్ నెలలో మద్యం సేవించి ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. రౌడీలను తీసుకువచ్చి నానారకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. సాయి శరణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మిల్లర్ల కొర్రీ.. రైతుకు వర్రీ

- నూక అవుతోందంటూ సాకు
- జిల్లాలో 20 వేల ఎకరాల్లో 1262 రకం వరి సాగు
- ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచి ఎదురుచూస్తున్న రైతులు
- తమను ఆదుకోవాలని విన్నపాలు

1262 రకం కొనేది లేదంటున్న మిల్లర్లు



కోలవెన్నులో సాగుచేసిన 1262 రకం వరి చేను

కంకిపాడు: పండించిన పంట అమ్ముకునేందుకు రైతులు నానా పాట్లు పడాల్సి వస్తోంది. మిల్లర్లు పెడుతున్న కొర్రీలతో రైతులు వర్రీ అవుతున్నారు. 1262 రకం ధాన్యం సేకరణకు మిల్లర్లు నో చెబుతుండటంతో సమస్య తలెత్తుతోంది. ధాన్యం సేకరణ సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడంలో సర్కారు పూర్తిగా వైఫల్యం చెందుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంట మిల్లులకు పోక కల్లాల్లో ధాన్యం రాశులు కుప్పలుగా కనిపిస్తున్నాయి.

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.64 లక్షల హెక్టార్లలో వరి సాగు జరిగింది. బీపీటీ, ఎంటీయూ, ఇతర సాధారణ రకాలను రైతులు సాగుకు ఎంచుకున్నారు. ఇందులో 1262 రకం విత్తనం జిల్లాలో 20 వేలు ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం పంట కోత కోసి ధాన్యం మిల్లులకు తరలించేందుకు, కొన్ని చోట్ల పొలాలు కోతకు సిద్ధంగా ఉన్నాయి.

నూక అవుతుందంటూ నిరాకరణ..

1262 రకం వరి ధాన్యం గింజ సన్నంగా ఉండటంతో మిల్లులో బియ్యం ఆడించే క్రమంలో నూక అవుతుందనే నెపంతో ఈ ఏడాది ఈ ధాన్యం సేకరించేందుకు కొందరు మిల్లర్లు మొండికేస్తున్నారు. ధాన్యం మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నా మిల్లర్లు నుంచి గోనె సంచులు రావడం లేదు. వాహనాలను పంపించడం లేదు. మిల్లర్లు ఈ రకం ధాన్యం సేకరించేందుకు వెనుకాడటంతో ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు తమ పరిస్థితి ఏంటన్న ఆందోళనలో మునిగిపోయారు. కోత కోయించిన ధాన్యం మిల్లులకు పోక కల్లాలు, రోడ్లపై రాశులుగా పోసి ఉంచారు.

గతంలో 1318 రకానికి..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌లో 1318 రకం ధాన్యాన్ని సేకరించేందుకు ఇదే విధంగా మిల్లర్లు నిరాకరించారు. నూక, ముక్క అవుతుందనే సాకు చెప్పారు. అయితే ప్రభుత్వ మార్గదర్శకాలతో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మిల్లర్లుతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం, సమీక్షలు చేయడంలో సఫలీకృతం అయ్యారు. రైతులు పండించిన ప్రతి విత్తన రకం ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకున్నారు. నిరంతరం మిల్లర్ల వద్ద తనిఖీలు చేపడుతూ ధాన్యం సేకరణ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడంతో రైతు పండించిన పంట కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు సమర్థంగా తరలింది. తేమశాతం ఆధారంగా రైతుకు ధర దక్కింది. ఈ దఫా మాత్రం 1318 కొనుగోళ్లు వేగంగా జరుగుతున్నాయి.

కొనడం లేదు

నేను 1262 విత్తనం రకం నాలుగు ఎకరాల్లో సాగు చేశాను. గత సీజన్లో 1262 రకం ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందీ తలెత్తలేదు. ఈ సారి మాత్రం ధాన్యం నూకవుతోంది.. సన్నం వల్లే సమస్య అంటూ మిల్లర్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదు. ఆర్‌ఎస్‌కేలో వివరాలు చెప్పినా.. మిల్లర్ నుంచి వాహనాలు, సంచులు పంపకపోవడంతో ధాన్యం బస్తాలు సిద్ధం చేసి, రోడ్ల మీదే ఉంచాను. 1262 రకం కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– టి. చంద్రశేఖర్, కోలవెన్ను

అన్ని రకాలూ కొనాల్సిందే..

1262 రకం నూక, ముక్క అవుతుందని మిల్లర్లు తీసుకోవడానికి వెనుకాడుతున్నట్లు సమాచారం అందింది. అయితే అన్నిరకాల ధాన్యం సేకరించాల్సిందేనని మిల్లర్లకు ఆదేశాలిచ్చాం. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. రైతులకు నష్టం జరగకుండా అన్ని చర్యలూ తీసుకుంటాం. గ్రామాలకు వెళ్లి సేకరణ ప్రక్రియను నిరంతరం పరిశీలిస్తున్నాం.

– డి.సృజన, మేనేజర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ

అంతా మొక్కుబడే..

ఈ దఫా ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభమైనా అధికారుల వ్యవహారం అంతా మొక్కుబడిగానే ఉంది. మిల్లర్లు నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను అధికారులు గానీ, కూటమి నేతలు గానీ పట్టించుకోవడం లేదు. రైతు సేవా కేంద్రాలు(ఆర్‌ఎస్‌కే) ద్వారా సేకరణను కూడా పర్యవేక్షించడం లేదు. అధికారులు, నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, ఇప్పటి వరకూ అధికారికంగా సమీక్షలు లేకపోవడంతో ఎవరికి వారే అన్నచందంగా సాగుతోంది. చివరికి అన్నదాతలకు నష్టం మిగులుతోంది.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

ఐద్వా నిరసన ప్రదర్శన



తాడిగడపలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఐద్వా నేతలు

పెనమలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని మండల ఐద్వా కార్యదర్శి పుసునూరు పాతాళలక్ష్మి విమర్శించారు. తాడిగడప కార్మికనగర్‌లో ఆదివారం ఐద్వా, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖపట్నంలో లా చదువుతున్న విద్యార్థినిని నలుగురు విద్యార్థులు అతి దారుణంగా అత్యాచారం చేశారన్నారు. ఈ ఘటనలో నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలు, యువతులు, బాలికలపై అత్యాచారాలు నానాటికీ పెరుగుతున్నాయని అన్నారు. మహిళల రక్షణపై పవన్‌కల్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనల కారణంగా నేడు ఆడపిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. గంజాయి, మద్యం కారణంగానే ఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు పి.లక్ష్మీనారాయణ, సోమశేఖర్, సి.హెచ్. దుర్గాప్రసాద్, పి.కృష్ణ, సి.హెచ్. భవాని, డి.రమణమ్మ, లావణ్య, యు.ఈశ్వరి, పి.దుర్గాభవాని, ఎం.వరలక్ష్మి, ఎం.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన



బుట్టలో బాల్ వేస్తున్న చిన్నారులు, మహిళలు

గన్నవరం: మండలంలోని మర్లపాలెం శివారు పామాయిల్ తోటల్లో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ ఆధ్వర్యాన కార్తిక వనసమారాధన ఉత్సాహంగా జరిగింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వాకర్స్ సభ్యులు ఆటపాటలతో సందడి చేశారు. తొలుత ఉసిరిచెట్టుకు మహిళలు పూజ చేసి వనసమారాధన ప్రారంభించారు. అనంతరం గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేఎస్ జగదీశ్వరరావు నేతృత్వంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. అలాగే చిన్నారులు, మహిళలకు వివిధ పోటీలను నిర్వహించారు. కొంత మంది వాకర్స్ పద్యాలు, పాటలతో సందడి చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వీకేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డీ శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రతినిధులు తిరివీధి వెంకయ్య, బీ బ్రహ్మారెడ్డి, బీ కోటేశ్వరరావు, ఎలీషా దేవసహాయం, గొట్టం రవిబాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

29న మహా మృత్యుంజయ సహిత రుద్ర హోమం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పిన్నమనేని హైట్స్ అపార్టుమెంట్ ప్రాంగణంలో ఈనెల 29వ తేదీన మాస శివరాత్రి పురస్కరించుకుని నవగ్రహ మహా మృత్యుంజయ సహిత రుద్ర హోమం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు కందిమళ్ల ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్తికమాసం పురస్కరించుకుని నెల ప్రారంభం నుంచి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివలింగ ప్రతిమ వద్ద పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అలంకారాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మాస శివరాత్రి రోజున గణపతి, లక్ష్మీగణపతి, నవగ్రహ పూజలు, పంచహారతులు నిర్వహిస్తామని వివరించారు. భక్తులు విశేషంగా పాల్గొని ఈ పూజా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

శ్రీశైలం దేవస్థానానికి కూరగాయల వితరణ



కూరగాయల వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న తులసీమోహన్

గన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం దేవస్థానంలో జరిగే నిత్య అన్నదానానికి స్థానిక శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణదేవి సహిత విశ్వేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఆదివారం రూ. 1.50 లక్షల విలువైన నాలుగు టన్నుల కూరగాయలను అందజేశారు. తొలుత ఆలయం వద్ద కూరగాయల వాహనానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచి గూడపాటి తులసీమోహన్ జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ.. కార్తిక మాసంలో శ్రీశైలంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి కూరగాయలను పంపడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఆలయ కమిటీ పిలుపు మేరకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూరగాయలు, ఆకుకూరలు అందజేసిన భక్తులను అభినందించారు. తొలుత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రముఖులు నెక్కలపూడి ఈశ్వరరావు, మండవ వెంకటప్రభాకరరావు, కాసరనేని రంగబాబు, టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, జాస్తి ఫణిశేఖర్, తుమ్మల మురళీకృష్ణ, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మోహనం.. కూచిపూడి నృత్యం





విజయవాడ కల్చరల్: జేఎంఎస్ యోగభారతి అకాడమీ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ నెల వారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. నాట్యాచార్యులు జంగం మనీషా చక్రవర్తి, జంగం శిరీషా చక్రవర్తి ఆధ్వర్యంలో పూర్వరంగం, బ్రహ్మాంజలి, సందెకాడ పుట్టినట్టి, బృందావనం, గోవర్ధనగిరిధారి, జావళి, బృందావన నిలయేరాదే, కృష్ణ శబ్దం, అంజనీ సుతుడు, పంతుము లాడెదమా అంశాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథి విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ శాస్త్రీయ నృత్యానికి పూర్వవైభవం తీసుకురావడానికి యువ నాట్యాచారిణిలు జంగం శిరీషా చక్రవర్తి, మనీషా చక్రవర్తి కృషిచేస్తున్నారని తెలిపారు. జేఎంఎస్ యోగభారతి నిర్వాహకులు జంగం విజయకుమార్, చక్రవర్తి, కళాపోషకుడు గోళ్ల నారాయణరావు, ఎం శ్రీనివాసకుమార్, జీ రామ్మోనరావు పాల్గొన్నారు. చిన్నారులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

ఓటు నమోదు చేసుకోండి

కంకిపాడు: జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వి. భావనారాయణ సూచించారు. మండలంలోని ఉప్పలూరు, పునాదిపాడు, గొల్లగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు శిబిరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ ఓటర్ల జాబితాను సరిచూసుకుని తప్పులు, మార్పులు సరిచేసుకునేందుకు అర్జీలు దాఖలు చేయాలని సూచించారు. పర్యటనలో ఆర్‌ఐ ఉస్మాన్, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఉయ్యూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతిచెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 23న విజయవాడ నుంచి మచిలీపట్నం వైపు వెళ్తున్న టిప్పరు లారీ వేగంగా వెళ్తూ ఉండగా చిన ఓగిరాల సమీపంలోని కన్వెన్షన్ సెంటరు వద్ద రోడ్డు దాటుతున్న మహ్మద్ మస్తాన్ (40)ను ఢీకొంది. ఘటనలో మస్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 23న రాత్రి మస్తాన్ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన టిప్పరు లారీ డ్రైవరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఉయ్యూరు టౌన్ పోలీసులు తెలిపారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



మద్దూరులో పూజలు చేస్తున్న భక్తులు



గంగానమ్మ గుడి ప్రాంగణంలో వెలుగుతున్న దీపాలు

కంకిపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో వేంచేసిన గంగానమ్మ గుడి వద్ద లక్ష దీపోత్సవం శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని లోక కల్యాణార్థం శివుని కల్యాణం జరిపించారు. భక్తులు ఆలయ ప్రాంగణం మొత్తాన్ని దీపాలతో అలంకరించారు. శివలింగాకృతిలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయం మారుమ్రోగింది.

దుర్గమ్మ సన్నిధిలో అన్నప్రసాద వితరణ



రెండో అంతస్తులో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



మొదటి అంతస్తులో బఫే విధానంలో అన్న ప్రసాద వితరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో భక్తులకు నిత్యాన్నదానం జరుగుతోంది. కార్తిక మాసం, ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, సాయంత్రం 7.30 నుంచి 8.30 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో నిత్యాన్నదానం చేస్తారు. శుక్ర, ఆదివారాల్లో రోజుకు ఎనిమిది వేలు, సోమవారం నుంచి గురువారం ఆరు వేల మందికి అన్నప్రసాద వితరణ ఉంటుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం రెండో అంతస్తులో భక్తులు కూర్చుని తినే విధానంలో, మొదటి అంతస్తులో బఫే పద్ధతిలో అన్నప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇక సాయంత్రం 7.30 గంటల నుంచి రాజగోపురం ఎదుట వెయ్యి మంది, శుక్రవారం, ఆదివారం 1,500 మందికి అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో రద్దీ అధికంగా ఉండటంతో అన్నప్రసాద వితరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులందరూ అన్నప్రసాదం స్వీకరించేందుకు, ఎక్కువ సమయం క్యూలైన్‌లో వేచి ఉండకుండా ఉండేందుకు బఫే పద్ధతిని ప్రవేశ పెట్టామని తెలిపారు. ఇక కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సోమవారాలతో పాటు విశేష పర్వదినాల్లో రోజుకు 2,500 మందికి మల్లేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం సంధ్యా సమయంలో అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రహదారి విస్తరణ ఎప్పుడో.?

- కేసరపల్లి–సావరగూడెం రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేయాలి
- ఎంతోకాలంగా కోరుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా వినియోగం



గుంతలు పడిన సావరగూడెం రోడ్డు

గన్నవరం రూరల్: కేసరపల్లి నుంచి సావరగూడెం మీదుగా విజయవాడకు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ఎంతో కాలంగా ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ రహదారి విజయవాడ వచ్చేందుకు, వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతోంది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు ఏర్పడిన సందర్భంలో విజయవాడ నుంచి రామవరప్పాడు ఫ్లైఓవర్ మీదుగా గన్నవరం మండలంలోని గ్రామాలకు చేరుకునేందుకు ఉపయోగపడే ఈ రోడ్డును మరింత వెడల్పుగా అభివృద్ధి చేయాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. గన్నవరం నుంచి విజయవాడకు వెళ్లే క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్ వల్ల వాహనాలు నిలిచిపోయి ప్రజలు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. ఈ క్రమంలో విజయవాడకు త్వరగా చేరుకోవడానికి సావరగూడెం, రామవరప్పాడు రోడ్డు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతోంది. ఉద్యోగులు, వ్యాపారులు నిరంతరం గన్నవరం నుంచి విజయవాడకు వందల మంది వెళుతుంటారు. అదేవిధంగా విద్యాసంస్థలకు చెందిన వందలాది వాహనాలు ఉదయం, సాయంత్రం వేళల్లో విజయవాడకు వెళ్లి వస్తుంటాయి. ఎక్కడైనా ట్రాఫిక్ నిలిచిపోతే వెంటనే ఈ రహదారి మార్గాన్ని జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఇప్పటి వరకూ ప్రజలు వినియోగిస్తున్నారు.

రోడ్డును వెడల్పు చేయాలి

ఈ రహదారిని మరింత వెడల్పు చేస్తే బాగుంటుందని గతంలోనే ఆర్‌అండ్‌బీ అధికారులు ఆలోచన చేశారు. సింగిల్ రోడ్డుగా ఉన్న సావరగూడెం రహదారి వెంట విల్లాలు, వెంచర్లు, పలు సంస్థలకు చెందిన గోడౌన్‌లు ఉన్నాయి. ఈ రోడ్డును వెడల్పు చేస్తే మరింతగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. కేసరపల్లి నుంచి సావరగూడెం మీదుగా ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం, ఏలూరు జిల్లా ఆగిరిపల్లి వరకూ వెళ్లేందుకు అవకాశం ఉంది. రహదారి విస్తరణతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ తగ్గి కొంతమేర వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటికైనా ఈ రహదారి అభివృద్ధికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ రహదారికి ప్రత్యామ్నాయం



కేసరపల్లి నుంచి సావరగూడెం మీదుగా విజయవాడకు వెళ్లే ఈ రహదారిని వెడల్పు చేయాలి. ఈ రోడ్డు మార్గం జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఉంది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ కష్టాలు తగ్గాలంటే ఈ రోడ్డును వెడల్పుగా నిర్మించాలి. దీంతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుంది.

– లంకా వెంకటగంగాధర్, సావరగూడెం

దుర్గమ్మ చెంత భక్తి సంగీతం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం విజయవాడకు చెందిన శృతిలయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో భక్తి సంగీతాన్ని ఆలపించారు. డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య నేతృత్వంలో పలు కీర్తనలు చక్కటి గాత్రంతో ఆలపించారు. కోదండ రామయ్యకు పాలపర్తి ఆంజనేయశాస్త్రి వయోలిన్‌పై, చిట్టిబాబు తబలాపై చక్కటి సహకారాన్ని అందించారు.